మేడ్చల్ బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ప్రొఫైల్



పేరు: ఏనుగు సుదర్శన్‌రెడ్డి
తండ్రి: సత్తిరెడ్డి
భార్య: సంగీతరెడ్డి
సంతానం: ఇద్దరు కూతుళ్లు
పుట్టిన రోజు: జూన్ 6, 1977
వృత్తి వ్యాపారం: పెట్రోల్ బంక్, రెడీమిక్స్ కంపెనీలు
విద్యాభ్యాసం: డిగ్రీ(బీకాం)
నివాసం: అవుషాపూర్
రాజకీయం నేపథ్యం: అవుషాపూర్ ఉప సర్పంచ్‌గా పనిచేశారు. అవుషాపూర్ ఎంపీటీసీగా బీఆర్‌ఎస్‌లో గెలిచి 2022లో బీజేపీలో చేరారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నారు.
ప్రస్తుతం: ఘట్‌కేసర్ ఎంపీపీగా, వైఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవలు అందిస్తున్నారు. – ఘట్‌కేసర్

బీజేపీలో అసమ్మతి సెగ

- ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి టికెట్ రావడంతో..
- రెబల్‌గా నామినేషన్ దాఖలు చేసిన విక్రంరెడ్డి

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ టికెట్ ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డికి అధిష్టానం ప్రకటించడంతో ఆ పార్టీ అసమ్మతి చిచ్చు రాజుకుంది. బీజేపీ టికెట్‌పై మొదటి నుంచి ఆశలు పెట్టుకున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రంరెడ్డికి టికెట్ చివరి నిమిషంలో నిరాకరించడంతో ఆయన రెబల్‌గా తన నామినేషన్ దాఖలు చేశారు. మేడ్చల్ బీజేపీ టికెట్‌ను విక్రంరెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు మోహన్‌రెడ్డి ఆశించారు. అధిష్టానం విక్రంరెడ్డి వైపు మొగ్గుచూపిన చివరి నిమిషంలో సుదర్శన్‌రెడ్డికి ఖరారు చేసింది. అలకబూనిన విక్రంరెడ్డి కేవలం తనకు కొంపల్లి మోహన్‌రెడ్డి వల్లే అన్యాయం జరిగిందని 30 ఏళ్లుగా పార్టీ నిర్మాణం కోసం పని చేస్తున్న తనకు అన్యాయం చేశారని కార్యకర్తల వద్ద వాపోయారు. శుక్రవారం ఉదయం గుండ్లపోచంపల్లిలోని తన నివాసంలో వివిధ మండలాలకు చెందిన బీజేపీ నాయకులతో సమావేశమై తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించి నామినేషన్ దాఖలు చేశారు. ఘట్‌కేసర్ ఎంపీపీగా పని చేస్తున్న సుదర్శన్‌రెడ్డి గత సంవత్సరం క్రితం వరకు మంత్రి మల్లారెడ్డి అనుచరుడిగా ఉంటూ మంత్రి నాయకత్వాన్ని వ్యతిరేకించి బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అవుషాపూర్ ఎంపీటీసీ స్థానం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. రెండేళ్ల పాటు బాగానే ఉన్నా మంత్రి మల్లారెడ్డి కారణంగా బీజేపీలో చేరి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న విక్రంరెడ్డి

బీజేపీ రెబల్‌గా నామినేషన్ దాఖలు

విక్రంరెడ్డి గుండ్లపోచంపల్లి వార్డు సభ్యుడి స్థాయి నుంచి రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడిగా, జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా, జాతీయ సుగంధ ద్రవ్యాల బోర్డు సభ్యుడిగా ఎన్నో పదవులు చేపట్టాడు. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీలలో పనిచేసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శిష్యుడిగా రాజకీయాల్లో రాణించారు. 30 ఏళ్ల నుంచి పార్టీలో ఉంటూ మేడ్చల్‌లో బీజేపీ అభివృద్ధికి తీవ్రంగా శ్రమించారు. పార్టీ తనకు పూర్తిగా అన్యాయం చేసిందని ఆగ్రహంతో శుక్రవారం విక్రంరెడ్డి బీజేపీ రెబల్‌గా తన నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఉదయం నియోజకవర్గ నాయకులు అమరం మోహన్‌రెడ్డి, బుద్ధి శ్రీనివాస్, తిరుమలరెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, జగన్‌గౌడ్ తదితర నాయకులతో తన నివాసం వద్ద సమావేశమై తన భవిష్యత్‌పై చర్చలు చేసి నామినేషన్ వేయాలని నిర్ణయించుకున్నాడు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నేతగా గుర్తింపు పొందిన విక్రంరెడ్డి రెబల్‌గా నామినేషన్ వేయడం చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్ నేతల గాలం..

విక్రంరెడ్డికి బీజేపీ టికెట్ రాలేదని తెలుసుకున్న బీజేపీ నేతలు అధిక సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని ఆయన ఇంటి వద్ద ఆయనకు మద్దతు తెలిపారు. ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి దూత ఉదయ్ సింహ, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు సాయిపేట శ్రీనివాస్, బేరి ఈశ్వర్ తదితరులతో కలిసి విక్రంరెడ్డి నివాసానికి వెళ్లారు. తమ పార్టీలోకి రావాలని విక్రంరెడ్డి కాంగ్రెస్‌లో చేరితే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే తన నిర్ణయం ప్రకటిస్తానని ఆయన తెలిపారు.

ధర్మం వైపు ఉన్న బీజేపీని గెలిపించండి

బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి



కీసర ఆర్డీవో కార్యాలయంలో బీజేపీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి

కీసర: ధర్మం వైపు ఉన్న బీజేపీకి ఈసారి ఓట్లు వేసి గెలిపించాలని మేడ్చల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కీసర ఆర్డీవో కార్యాలయంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బీజేపీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ధర్మం వైపు ఉన్న బీజేపీకి, అవినీతి, అధర్మం వైపు ఉన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య ఎన్నికలు జరగనున్నాయి. ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇక తనకు బీజేపీ నుంచి టికెట్టు కేటాయించినందుకు పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో అందరినీ కలుపుకొని ఎన్నికల్లో ముందుకెళ్తానని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి కూడా బీజేపీ తరఫునే నామినేషన్ దాఖలు చేశారు. నిన్నటి వరకు టికెట్టు తనకేనంటూ హామీ ఇచ్చిన బీజేపీ పెద్దలు శుక్రవారం ఉదయం సుదర్శన్‌రెడ్డి పేరు ప్రకటించడం పట్ల అధిష్టానం పార్టీ కోసం పనిచేసిన తనలాంటి సీనియర్ నేతలకు సమాధానం చెప్పాలన్నారు. మేడ్చల్ టికెట్టు విషయంలో బీజేపీ పెద్దలు మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

మేడ్చల్ జిల్లాలో 251 నామినేషన్లు దాఖలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 3 నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తంగా 251నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 87 నామినేషన్లు దాఖలు కాగా, మల్కాజిగిరి అసెంబ్లీ స్థానంలో 51, కూకట్‌పల్లిలో 44, ఉప్పల్‌లో 37, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 32 నామినేషన్లు దాఖలయ్యాయి.

ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు వీరే..

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మంత్రి చామకూర మల్లారెడ్డి(బీఆర్‌ఎస్), తోటకూర వజ్రేష్ యాదవ్(కాంగ్రెస్), ఏనుగు సుదర్శన్‌రెడ్డి (బీజేపీ)నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మైనంపల్లి హన్మంతరావు(కాంగ్రెస్), మర్రి రాజశేఖర్‌రెడ్డి(బీఆర్‌ఎస్), ఎన్.రామచంద్రరావు నామినేషన్లు దాఖలు చేయగా, ఉప్పల్ నియోజకవర్గం నుంచి బండారి లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్), ఎం.పరమేశ్వర్‌రెడ్డి(కాంగ్రెస్), ఎన్ఎస్ఎస్ ప్రభాకర్(బీజేపీ), కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వివేకానంద(బీఆర్‌ఎస్), కూన శ్రీశైలంగౌడ్(బీజేపీ), కొలన్ హన్మంతరెడ్డి (కాంగ్రెస్), కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాధవరం కృష్ణారావు(బీఆర్‌ఎస్), బండి రమేష్(కాంగ్రెస్) తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు.

ఫైన్ ఆర్ట్స్ స్కూల్లో జాతీయ కళా ఉత్సవ్ పోటీలు



కళాఉత్సవ్ పోటీలో విద్యార్థులతో అధికారులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ స్కూల్లో శుక్రవారం జాతీయ కళా ఉత్సవ్ జూమ్ పోటీలు నిర్వహించారు. బాలబాలికలకు సంగీతం, నాట్యం, విగ్రహాల తయారీలో పోటీలు జరిగాయి. 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్ మల్కాజిగిరి జిల్లా ఫైన్ ఆర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ మధులత, ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీధర్, ప్లానింగ్ కో ఆర్డినేటర్స్ అయ్యన్న, పాపిరెడ్డి, రాధా పద్మజ విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నికల్ క్లబ్ ప్రారంభం



టెక్నికల్ క్లబ్ ప్రారంభోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్సీఈ కళాశాలలో టెక్నికల్ క్లబ్ ప్రారంభించారు. డేటా సైన్స్ విద్యార్థులు ఇన్నోవిస్టా పేరుతో ఏర్పాటు చేసిన క్లబ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్ ద్వారా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దీపావళి వేడుకలు



వివిధ వేషధారణలతో కనువిందు చేసిన రాక్‌ఉడ్స్ విద్యార్థులు

పోచారం: యంనంపేట్‌లోని రాక్ ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో దీపావళి పండగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో పండగ ప్రత్యేకతను చాటే అంశాలను ప్రదర్శించి కనువిందు చేశారు. ఈ సందర్భంగా స్కూల్ సీఈఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. దీపావళి రోజున టపాసులు పేల్చే సమయంలో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్దల సమక్షంలోనే పిల్లలు బాణాసంచా కాల్చాలని చెప్పారు. పర్యావరణానికి హాని చేయని హరిత టపాసులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామానాయుడు, హెచ్ఎం శ్రీరంజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

మల్లాపూర్: నాచారం సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల చైర్మన్ ఉదయ్ కుమార్, డైరెక్టర్ విద్యా స్రవంతి ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ప్రదర్శనను తిలకించారు. డైరెక్టర్ విద్యా స్రవంతి మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయవచ్చన్నారు. ఫుడ్ ఫెస్ట్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని అనాథ పిల్లలకు అందిస్తామని తెలిపారు.

రవీంద్రభారతిలో దీపావళి వేడుకలు

కాప్రా: ఈసీఐఎల్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ లలిత, విద్యార్థులతో కలిసి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు పర్యావరణాన్ని కాపాడటం కోసం ఈకో ఫ్రెండ్లీ దీపావళి జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

ఉప్పల్: పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్‌లో నివాసం ఉండే శ్రీనివాస్ రోజు కూలి. ఇతడి కుమారుడు ఓంప్రకాశ్(15) స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు కూలికి వెళ్లడంతో ఇంట్లో చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ జిల్లాకు సాధారణ ఎన్నికల పరిశీలకులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు సాధారణ పరిశీలకులను నియమించింది. జిల్లాలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా అమన్ మిట్టల్, మల్కాజిగిరి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా పూర్వా గార్గ్, మేడ్చల్ నియోజకవర్గానికి ఎస్.కె.జైన్ నియమితులయ్యారు. అలాగే, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, కూకట్‌పల్లి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలీసు సాధారణ పరిశీలకులుగా నేహా యాదవ్‌ను నియమించారు. వీరందరికీ శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ తీరును ఆయన తెలిపారు.

గుండ్లపోచంపల్లి యాదవ సంఘం ఎన్నిక

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ యాదవ సంఘం నూతన కమిటీ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షులుగా ఉన్నిగొర్ల రాముయాదవ్, ఉపాధ్యక్షులుగా మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా సురేశ్ యాదవ్, కార్యదర్శి బాలరాజ్, కోశాధికారి సంపత్ యాదవ్, సభ్యులుగా పెంజర్ల సురేశ్, నందుయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హత్య కేసులో 9 మంది అరెస్ట్

పోచారం: అన్నోజిగూడలో మైనర్ బాలికతో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్న యువకుడు దారావత్ కరణ్ నాయక్ హత్య కేసులో 9 మంది నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పోచారం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ యం.మహేందర్‌రెడ్డి తెలిపారు. నిందితులు మహారాష్ట్రకు పారిపోతుండగా ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు చిక్కిన వారిలో గాయక్వాడ్ దొండిభ, గాయక్వాడ్ రాధాబాయి, కిరణ్ అలియాస్ కరణ్, నాందేవ్ ఖండు, సింగదే సుధీర్ ఖండు, మాధవ్ సోపాన కుమాపలే, సింగదే సురేష్, రామసింగదే, సూర్యవంశీ కేశవ్ ఉన్నారు. వీరందరినీ రిమాండ్ కోసం కోర్టుకు తరలించారు.

నకిలీ వైద్యుడి గుట్టురట్టు

మేడిపల్లి: పీర్జాదిగూడ 8వ డివిజన్‌లోని ఓ నకిలీ వైద్యుడి గుట్టును రట్టు చేశారు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ స్వామి. వివరాలు.. ఏడాది కాలంగా పీర్జాదిగూడ 8వ డివిజన్‌లో సుకుమార్ అనే వ్యక్తి ఫేక్ సర్టిఫికెట్లతో ఓ మినీ క్లీనిక్‌లో పలువురికి వైద్యం అందిస్తున్నాడు. అమాయక ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లా వైద్య అధికారి విచారణ జరిపి శుక్రవారం క్లీనిక్‌ను సీజ్ చేశారు. జిల్లా వైద్యాధికారి రావడం గమనించిన నకిలీ వైద్యుడు లోపలే ఉండి తాను ఇతర ప్రాంతాల్లో ఉన్నానని నమ్మించే ప్రయత్నం చేశాడు. అతడు లోపలే ఉన్నట్లు గమనించిన అధికారులు అతడిని బయటకు తీసుకువచ్చి క్లీనిక్‌ను సీజ్ చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నారాయణ, ఉప్పల్ మెడికల్ ఆఫీసర్ సౌందర్యలత, డెమో అంజన్న తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు

బోడుప్పల్: కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు జన్మదిన వేడుకలు శుక్రవాం ఆర్. కన్వెన్షన్‌లో జరగ్గా పలువురు కాంగ్రెస్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ఫెడరేషన్ అధ్యక్షులు చెంచల నర్సింగ్‌రావు తదితరులున్నారు.



ఆలయ భూముల్లో నిర్మాణాలు చేపడితే ఊరుకోం..



ఘట్‌కేసర్‌లోని ఆలయ భూముల్లో పనులు నిలిపి వేయిస్తున్న చైర్మన్ వేణుగోపాల్‌ముదిరాజ్, డైరెక్టర్లు

ఘట్‌కేసర్: శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని వెంకటాపూర్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఉదారి వేణుగోపాల్‌ముదిరాజ్ హెచ్చరించారు. ఘట్‌కేసర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూముల్లో అక్రమంగా చేపట్టిన పలు నిర్మాణాలను డైరెక్టర్లతో కలిసి శుక్రవారం నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణదారుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేశారని, సదరు వ్యక్తులు మా దృష్టికి తీసుకొచ్చారని, వారిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. మధ్యవర్తులు ఆలయ భూముల్లో ప్లాట్లు చేసి అమాయకులకు విక్రయిస్తున్నారని, ప్లాట్లను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు నవీన్‌కుమార్ ముదిరాజ్, లింగంముదిరాజ్, శంకర్‌ముదిరాజ్, శేఖర్, మాజీ వార్డు సభ్యుడు సుధాకర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

మంత్రిగా.. మేడ్చల్‌కు చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్

- పేదల భూములు కబ్జా.. తప్ప అభివృద్ధి ఏదీ..?
- ఓటమి భయంతోనే విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు
- నియోజకవర్గ ప్రజలు బుద్ధి చెప్పే రోజు వచ్చింది
- కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేదల భూములు కబ్జా చేశాడే తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదని, మంత్రిగా ఉండి మేడ్చల్‌కు ఏమీ చేయలేని వ్యక్తి పరిపాలనకు పనికి రాడని కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ మండలంలోని గ్రామాల్లో పాదయాత్ర, కార్నర్ మీటింగ్‌లతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి– నియంతృత్వ పాలనకు మధ్య యుద్ధం జరుగుతోందని, ఆత్మబలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో సాగుతున్న కేసీఆర్ నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడతారని తెలిపారు.

- మంత్రి మల్లారెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా మేడ్చల్ నియోజకవర్గం ఒరగబెట్టిందేమీ లేదన్నారు. మల్లారెడ్డి అధికారాన్ని అడ్డుపెటుకుని ప్రభుత్వ, పేద ప్రజల భూములు కబ్జాచేసి వారిని ఇబ్బందులకు గురి చేశాడు తప్ప అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. కార్మిక శాఖ మంత్రిగా కొనసాగిన మల్లారెడ్డి మేడ్చల్‌కు మెడికల్, డిగ్రీ కళాశాలలు ఎందుకు తీసుకురాలేకపోయాడో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
- మల్లారెడ్డి రాష్ట్ర మంత్రిగా కార్మికులకు ఎంతో చేశాడో తెలపాలని, మేడ్చల్ నియోజకవర్గానికి మంత్రిగా వ్యవహరించి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి పాటుపడకుండా భూముల కబ్జాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఓటమి భయంతో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తున్నాడని, కుల సంఘాలు, ఆలయాలకు డబ్బులు ఇస్తున్నాడని, అక్రమంగా సంపాదించి పంచుతున్న డబ్బులను ప్రజలు తీసుకున్ని బుద్ధి చెప్పే రోజులు వచ్చాయన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు పోచయ్య, మల్లారెడ్డి, అక్రంపాష, సర్పంచ్ వెన్నెలరామకృష్ణుడు, ఎంపీటీసీ కుమార్‌యాదవ్, కౌన్సిలర్ నడికొప్పు నాగరాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రాహుల్‌యాదవ్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి శూన్యం



ఎదులాబాద్ ఆత్మీయ సభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

- పైసలు సంపాదించుకున్నారు
- నాలాంటి నాయకుడు దొరకడు
- మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: మేడ్చల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి శూన్యమని, పైసలు సంపాదించుకున్నారని, నాలాంటి నాయకుడు దొరకడు, ఊరూరు తిరిగి సొంత డబ్బుతో అభివృద్ధి పనులు చేస్తున్నానని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఎదులాబాద్, మర్పల్లిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సభలో మంత్రి మాట్లాడుతూ సొంత డబ్బుతో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, ఆలయాలు నిర్మించానన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌తో తెలంగాణలోని వృద్ధులు కుటుంబసభ్యులకు అప్పు ఇచ్చే స్థాయికి వచ్చారన్నారు. నాకంటే గొప్పగుణం, పని చేసేవారుంటే వారికే ఓటేయాలన్నారు. నవంబర్ 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని, మా కొడుకుతో కలిసి వాచ్‌మెన్‌గా పనిచేస్తానని హామీనిచ్చారు. అంతకు ముందు శ్రీగోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ దయాకర్‌రెడ్డి, సర్పంచ్ సురేశ్, ఉప సర్పంచ్ లింగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీటీసీలు రవి, కష్టమూర్తి, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, బాల్‌రాజ్‌ముదిరాజ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, ఎదులాబాద్ బీఆర్‌ఎస్ శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శి శంకర్, చిరంజీవి ముదిరాజ్, మర్పల్లిగూడ అధ్యక్షుడు లక్ష్మణ్, శ్రీకాంత్, ఆనంద్, రవిగౌడ్ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం

బోడుప్పల్: మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని మాజీ సర్పంచ్ తోటకూర లక్ష్మి, 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్ అన్నారు. బోడుప్పల్ 15వ డివిజన్ రాజలింగం కాలనీ ఫేస్–2లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకూ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. బోడుప్పల్‌లో ఎన్నో సమస్యలున్నాయని, వాటిని మంత్రి చామకూర మల్లారెడ్డి పట్టించుకోకుండా కేవలం రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో మల్లారెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శారద కిషన్, రామకృష్ణ కాలనీ అధ్యక్షుడు కొండలరావు, కాలనీవాసులు విష్ణు, చంటి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలి

బోడుప్పల్: బీఆర్‌ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు చామకూర ప్రీతిరెడ్డి అన్నారు. 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో మల్లయ్యనగర్ పార్కు వద్ద శుక్రవారం మహిళలతో నిర్వహించిన మహిళా సదస్సు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో కాలంగా రాచెరువు సమస్య ఉండగా స్థానిక కార్పొరేటర్ సహకారంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకుని మరోసారి మంత్రి చామకూర మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉప్పల్‌లో 64 నామినేషన్లు, 37 మంది అభ్యర్థులు

ఉప్పల్: ఉప్పల్ ఎన్నికల కార్యాలయంలో నామినేషన్ చివరి రోజు 30 నామినేషన్లను వేశారు. చివరి రోజు శుక్రవారం వరకు 64 నామినేషన్లు వచ్చాయి. అందులో 37 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇందులో స్వతంత్ర అభ్యర్థులతోపాటు వివిధ జాతీయ పార్టీల, ఇతర పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్‌లకు చివరి రోజు కావడం అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి ఎన్నికల కార్యాలయంలో క్యూకట్టారు. శుక్రవారం రాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగింది.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

హబ్సిగూడ: హబ్సిగూడలోని సుప్రభాత్ హోటల్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్, జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఎనిమిది ఏళ్లయినా ఎన్నికల హామీని అమలు చేయకుండా చోద్యం చూస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగల పట్ల తన వైఖరిని మార్చుకోవాలన్నారు. కోర్ కమిటీ సభ్యులు గుర్రాల శ్రీనివాస్, డాక్టర్ మల్లేష్, కోర్ర శంకర్, పొట్టపెంజర రమేష్, సాలేంద్ర బాబురావు, బంగారి శ్రీను, చింత బాబు, క్యాదశి మోహన్, ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు కొల్లూరి వెంకట్, వరిగడ్డ చందు, జీవన్, ధర్మారపు శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్